సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 30 । మార్చి । 2023



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. - 10లో▸



వసంతోత్సవానికి వేళాయె

నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం. స్ప్రింగ్ స్ప్రీ-23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

36.3°/24.1°

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.



ఇఫ్తార్	సహర్
గురు 6:35	శుక్ర 4:49

రంజాన్ వేళలు



ఎదుర్కోలు..

శ్రీరామ నవమిని పురస్కరించుకొని కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలో బుధవారం రాత్రి ఎదుర్కోలు సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేవెల్లి మమత, సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, దేవేందర్, ప్రశాంత్‌రెడ్డి, పద్మ, రాజయ్య పాల్గొన్నారు. - కాళేశ్వరం



శోభాయాత్ర

కాటారం మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల మొదటి రోజులో భాగంగా పాలపొరక, ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో లక్ష్మణుడు, ఆంజనేయుడు సహిత సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. - కాటారం



నేడు రాములోరి కల్యాణం..

గురువారం జరగనున్న రాములోరి కల్యాణానికి జిల్లావ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలో కోదండరామాలయం, శ్రీభక్తాంజనేయస్వామి, రేగొండ మండలం రూపిరెడ్డిపల్లిలోని ఆలయాలు విద్యుత్ కాంతుల్లో వెలుగొందుతున్నాయి. కల్యాణ ఏర్పాట్లను ఆలయ కమిటీలు చేశాయి. భక్తులు హాజరై కల్యాణం వీక్షించేలా పందిర్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. - భూపాలపల్లి అర్బన్

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,686మందికి 1,622మంది హాజరుకాగా.. 64మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 12రోజుల పాటు ఎటువంటి సంఘటనలూ చోటుచేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 31, ఏప్రిల్ 1న ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఉంటాయని తెలిపారు.

జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

భూపాలపల్లి: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటినుంచి జిల్లాలోని జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సభాధ్యక్షత వహించనుండగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు హాజరుకానున్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం'

పలిమెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని భీం సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మీద కుట్ర పూరితంగానే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఆరోపణలు చేస్తున్న వారిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చిన్నయ్యపై ఆరోపణలు మానుకోవాలని, ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచితంగా విద్య, వైద్యం



టేకుమట్ల(రేగొండ): నిరుపేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించాలని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. సాధన సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలో చేపట్టిన పాదయాత్ర బుధవారం రేగొండ మండలం రాయపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా విద్య, వైద్యం అందించకపోవడంతో నిరుపేదలు వీటికోసం అధికంగా ఖర్చుచేస్తున్నారన్నారు. దీంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఏడునూతల నిశీధర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జ్ నమిండ్ల కరుణాకర్, గ్రామస్తులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



కాటారం: మండలకేంద్రంలోని గారెపల్లిలో ఇటీవల మృతిచెందిన తోట మల్లక్క కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకుడు జక్కు రాకేశ్ పరామర్శించారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, జోడు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఎలుబాక సుజాత, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వంగళ రాజేంద్రాచారి, కొండగొర్ల వెంకటస్వామి, ముక్తి తిరుపతి ఉన్నారు.

మెరిసిన మరియపురం!

పట్టుదల ఉంటే విజయం మీ సొంతం

నాలుగు రోజులు మార్కెట్ బంద్

- 12లో▸

లక్ష్యం దిశగా..

జీపీల్లో 89.09శాతం పన్నుల వసూలు

- లక్ష్యం రూ.4,00,69,809
- వసూలు చేసింది రూ.3,56,99,955
- నేడు, రేపు మాత్రమే గడువు..



భూపాలపల్లి రూరల్: ఆర్థిక సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగియనుండగా గ్రామపంచాయతీలు పన్నుల వసూలు లక్ష్యం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 89.09శాతం పన్నులు వసూలు చేయగా.. వంద శాతం పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి సారించారు. జీపీ ఉద్యోగులు, సిబ్బంది ఉదయం నుంచే రిజిస్టర్లు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు.

2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలో ఆస్తి పన్ను రూ.4,00,69,809 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.3,56,99,955 వసూలు(89.09శాతం) చేశారు. ఇంకా రూ.43,69,854 వసూలు చేయాల్సి ఉంది. మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అధికారులు మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు.

అన్ని అనుమతులూ ఆన్‌లైన్‌లోనే..

గ్రామ పంచాయతీల్లో మొదట్లో కేవలం ఇళ్ల అనుమతులకు మాత్రమే ఆన్‌లైన్ సేవలందిస్తూ మిగితా అన్ని రకాల సేవలు ఆఫ్‌లైన్‌లోనే కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుతం జీపీల సేవల్లో పారదర్శకత కోసం అన్ని రకాల అనుమతులు ఆన్‌లైన్ విధానంలోని తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీల్లో పన్నులు, నాన్‌ట్యాక్స్ రూపంలో నిధులు సమకూర్చుకుంటారు. ప్రధానంగా ఇంటి పన్నుల రూపంలో, ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల్లో తైబజార్ ద్వారా వచ్చే రాబడులు, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, అనుమతులు తదితర సేవల ద్వారా సమకూరే నిధులను నాన్‌ట్యాక్సు కింద లెక్కిస్తారు. ట్యాక్సు, నాన్‌ట్యాక్సుల ద్వారా మొత్తంరూ.3,56,99,955 వసూలు చేశారు.

కాటారం టాప్.. మొగుళ్లపల్లి లాస్ట్ ..

ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లాలో కాటారం మండలం రూ.(97.42)వసూలు చేసి మొదటి స్థానంలో నిలువగా, మొగుళ్లపల్లి (75.83)శాతంతో చివరి స్థానంలో ఉంది. మిగితా మండలాల్లో 84 నుంచి 96 శాతం వరకు పన్నులను వసూలు చేశారు. వసూళ్లలో వెనుకబడిన పంచాయతీలపై అధికారులు ప్రత్యేకదృష్టి సారిస్తున్నారు. రెండు రోజుల్లో ఎలాగైనా వంద శాతం లక్ష్యాలను సాధించాలని కార్యదర్శులకు, సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

పన్నుల వసూళ్ల వివరాలు (శాతంలో)

మండలం	శాతం
కాటారం	97.42
భూపాలపల్లి	96.48
రేగొండ	94.82
చిట్యాల	94.48
మల్హర్	92.46
టేకుమట్ల	88.34
పలిమెల	88.22
మహాముత్తారం	87.05
మహదేవపూర్	85.14
గణపురం	84.24
మొగుళ్లపల్లి	75.83



నాగారంలో పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి

వంద శాతం వసూలుకు కృషి..



జిల్లాలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధంచేసి తదనుగుణంగా పనిచేయడంతో ఇప్పటివరకు 89.09శాతం వసూలు చేయగలిగాం. ఈ రెండు రోజులు అధికారులు వసూళ్లపై దృష్టి సారించనున్నారు. ప్రజలు అధికారులకు, సిబ్బందికి సహకరించి పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.

- ఆశాలత డీపీఓ

అన్నంత పని చేశాడు..

భార్య, కూతురిని గొడ్డలితో నరికి చంపిన భర్త

- మూడు నెలల నుంచి చంపుతానని బెదిరింపులు
- తప్పించుకున్న కుమారుడు
- నిందితుడిని చితకబాదిన స్థానికులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాములు



నిందితుడి కుమారుడు విశ్వ

భూపాలపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో సైకోగా మారిన ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులను చంపుతానని నిత్యం బెదిరించేవాడు. చివరకు అన్నంత పని చేశాడు. పెళ్లి సంబంధం కుదిరిన కూతురిని, భార్యను పైశాచికంగా గొడ్డలితో నరికి చంపిన సంఘటన భూపాలపల్లి పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లికి చెందిన ఎలకంటి ఆగయ్యకు కుమారుడు రమణాచారి ఉన్నాడు. రమణాచారికి 20 ఏళ్ల క్రితం రమ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇంటర్మీడియట్ చదువుతున్న కూతురు చందన (18), కుమారుడు విశ్వ ఉన్నారు. రమణాచారికి అత్తింటి వారు ఇచ్చే వరకట్నం విషయంతో పాటు భార్యాభర్తల మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. దీంతో కొన్ని రోజుల పాటు వేశాలపల్లిని వదిలి పట్టణంలోని క్రిష్ణాకాలనీలో నివాసం ఉన్నారు. అక్కడ వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని సాకాడు. తిరిగి నాలుగు నెలల క్రితం వేశాలపల్లికి వచ్చి ఉంటున్నాడు. మళ్లీ గొడవలు ప్రారంభమై రమణాచారి సైకోగా మారాడు. మూడు నెలలుగా కుటుంబ సభ్యులను చంపుతానంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. నిత్యం గొడవ చేస్తుండటంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయినప్పటికీ అతడి వైఖరిలో మార్పు రాలేదు.

మనుమరాలి పెళ్లి చేద్దామనుకున్న తాత..

రమణాచారి పరిస్థితిని గమనించిన నిందితుడి తండ్రి ఆగయ్య ఇటీవలే మనుమరాలు చందనకు వివాహం చేద్దామని నిశ్చయించుకున్నాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగితో పెళ్లిచూపులు కూడా పూర్తయ్యాయి. తనకు హనుమకొండలో ఉన్న ఫ్లాట్‌ను అమ్మి వరకట్నం కింద ఇస్తానని ఆగయ్య హామీ ఇచ్చాడు. ఇందుకు అబ్బాయి తరపు వారు అంగీకరించారు. ఈ విషయంలో కూడా రమణాచారికి తన తండ్రికి మధ్య వాగ్వివాదం నెలకొన్నట్లు సమాచారం.

కాళ్లు మొక్కినా కనికరించలే..

నిందితుడి భార్య రమ బుధవారం వ్యవసాయ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంటి పనులు చేసుకుంటున్న క్రమంలో డబ్బులు కావాలని రమణాచారి అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య కాసేపు గొడవ జరిగింది. చివరకు డబ్బులు ఇవ్వడంతో బయటకు వెళ్లి మద్యం సేవించి తిరిగి రాత్రి 6.50 గంటలకు ఇంటికి వచ్చాడు. మరలా గొడవ జరుగగా అడ్డువచ్చిన కూతురు చందనను తొలుత గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందగా, భార్య రమ రోదిస్తూ రమణాచారిని బతిమిలాడసాగింది. అయినప్పటికీ వినకుండా భార్య రమను కూడా గొడ్డలితో నరికి చంపాడు. ఇంట్లోనే ఉన్న కుమారుడు విశ్వ వెంటనే బయటకు పరిగెత్తి 'మా నాన్న... మా అమ్మని, అక్కని నరికి చంపాడు' అంటూ అరిచాడు. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకోగా నిందితుడు బయటకు వచ్చి ఎవరైనా అడ్డం వస్తే గొడ్డలితో చంపుతానంటూ బెదిరించాడు. చివరకు స్థానికులు అతడిని పట్టుకొని చితకబాది 108లో ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి డీఎస్పీ రాములు పరిశీలించగా స్థానిక ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా 'పది' పరీక్షలు

వీసీలో మంత్రి సబితాఇంద్రారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ

భూపాలపల్లి: జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. పరీక్షల నిర్వహణపై బుధవారం విద్యాశాఖ సెక్రెటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలో గతంలో ఉన్న 11 పేపర్లను ప్రస్తుతం ఆరు పేపర్లకు కుదించామని.. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 3,651మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని.. వారికోసం 20పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఎనిమిది కిలోమీటర్ల కంటే దూరంలో ఉన్న మూడు పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాల తరలింపు కోసం రెండు రూట్లను గుర్తించామని తెలిపారు. 10వ తరగతి పరీక్షల కోసం 20మంది చీఫ్ సూపరింటెండెంట్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, 200మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సురేందర్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, డీఈఓ రాంకుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్ధు

భూపాలపల్లి: వేసవి కాలంలో మున్సిపాలిటీలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరగా..కొత్త బోర్లు వేయడం, పాత బోర్ల మరమ్మతులకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అవినాష్, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్ల వద్ద ఉన్న, మున్సిపాలిటీ పరిధిలో గల ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రతీ వారం ఒకరు చనిపోతున్నారని చెప్పారు. 2021లో 51 మంది, 2022లో 75మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని అన్నారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 353 జాతీయ రహదారి పరకాల నుంచి కాళేశ్వరం రోడ్డుకు ఇరువైపులా ట్రక్ పార్కింగ్ లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అక్కడ ట్రక్ పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు పార్కింగ్ స్థలాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు తయారుచేసి జాతీయ రహదారుల అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావడమే లక్ష్యం

కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



సైకిళ్లు, కుట్టుమిషన్లు, టీషర్టులు అందజేస్తూ..

కాటారం: ప్రజల్లో మమేకమై నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా సీఆర్పీఎఫ్, పోలీస్‌శాఖ ముందుకెళ్తుందని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జి 58 సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, క్రీడాకారులకు టీషర్ట్స్, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో గ్రామాల్లోని నిరుపేదలకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజసేవలో ముందుంటూ ప్రజలకు ఏదో విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అసాంఘిక శక్తులకు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ డీఎస్పీ కోమల్ ప్రీత్ కౌర్, కాటారం సీఐ రంజిత్‌రావు, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ ప్రత్యేక పూజలు



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండ స్వగ్రామమైన పరకాల మండలంలోని నర్సక్కపల్లి నుంచి కోటంచ ఆలయానికి ర్యాలీగా వచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిక కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీఇచ్చారు.అనంతరం ఆయనను నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కత్తి సంపత్, వావిలాల రమేష్, గునిగంటి మహేందర్, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహాముత్తారం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మంజుల అన్నారు. సివిక్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ 58వ బెటాలియన్ బీ కంపెనీ ఆధ్వర్యంలో గొత్తికోయ యువకులకు సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, యువకులకు క్రీడాసామగ్రితో పాటు టీషర్టులు పంపిణీ చేశారు. అనంతరం మంజుల మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. క్రీడాకారులు క్రీడలతో పాటు ఉన్నతంగా చదివి మంచిస్థానాల్లో నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం ఎస్సై సుధాకర్, కొర్లకుంట, మహాముత్తారం, యామన్‌పల్లి, రెడ్డిపల్లి, సింగారం సర్పంచులు, సీఆర్‌పీఎఫ్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



పలిమెల: మిషన్లు, ట్రై సైకిళ్లతో..

పలిమెలలో..

పలిమెల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఆర్పీఎఫ్ 58 బెటాలియన్ డీ కంపెనీ ఇన్‌చార్జ్ సుబ్బరాజు అన్నారు. పలిమెల పోలీస్ స్టేషన్‌లో సివిక్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహదేవ్‌పూర్ సీఐ కిరణ్, పలిమెల ఎస్సై అరుణ్‌లతో కలిసి కుట్టు మిషన్లు, టై సైకిళ్లు, యువతకు సైకిళ్లు, క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేశారు.

సైన్స్‌తోనే వ్యక్తిత్వ వికాసం



నోటి ద్వారా మంటలు తెప్పిస్తున్న నరేష్

మహదేవపూర్: సైన్స్‌తోనే వ్యక్తిత్వ వికాసం అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. మహిమలు బూటకం– సైన్స్ నిజం అనే అంశంపై మండల పరిధిలో బొమ్మపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని అన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమకని తెలిపారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం, లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్, క్యాంపు కోఆర్డినేటర్ పరశరాములు, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

- కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లేయత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్, కేసు నమోదు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు



పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు చోటు చేసుకుంది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జేఏసీ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లి పోతామని విద్యార్థి జేఏసీ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలన భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు. మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీలో తిష్ట వేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కల్లేపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, బి నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.


ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

–తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జాక్ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

–మేడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: ఏపీ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ జిల్లాలో అమ్మకాలు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి. సీతారాం తెలిపారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై ఎస్‌కె జానీపాషాతో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన కూకట్ల నిశాంత్, గోవిందరాజుల గుట్టకు చెందిన బొల్లి లక్ష్మణ్, భూపాలపల్లికి చెందిన మహ్మద్ అజహర్, తొగరి నిఖిల్, తొర్రూరు మండలం మడిపల్లికి చెందిన సిరబోయిన కృష్ణ, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన చీకటి కిరణ్‌లు కలిసి రెండు రాష్ట్రాల మీదుగా వరంగల్, జనగామ ప్రాంతాలకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌తో కలిసి నిశాంత్ గంజాయి అమ్మకాలు చేసే వారు. ఇటీవల జలీల్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లడంతో బుల్లి లక్ష్మణ్, అజహర్‌తో కలిసి నిశాంత్ సులభతరంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గంజాయి సప్లయ్ చేస్తున్నారు. నెల్లికుదురుకు చెందిన కృష్ణమూర్తి, కిరణ్‌పై వరంగల్, మహబూబాబాద్, ఖమ్మంలో గంజాయి కేసులు నమోదు కావడంతో పోలీసుల కళ్లు కప్పి వారి మకాం జనగామకు మార్చుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు నర్మెట మండల కేంద్రం హెచ్‌పీ, ఏసర్ పెట్రోలు బంకులు, దుర్గమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వేర్వేరుగా తనిఖీలు చేపట్టగా వాహనాలపై వెళ్తున్న ఆరుగురు వ్యక్తులపై అనుమానం వచ్చి తనిఖీలు చేయగా వీరి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న సీఐ నాగబాబు, ఎస్సై జానీపాషా, హెడ్ కానిస్టేబుల్ గట్టయ్య, కానిస్టేబుళ్లు ధనుంజయ్, ప్రవీణ్, రహమత్‌అలీ, హమీద్, రాజు, రమేష్, గాలిబ్‌లను డీసీపీ అభినందించారు.

వసంతోత్సవానికి వేళాయె

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ–23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతి సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్ స్ప్రీ–23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను, మన సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకుని మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ–23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మిథియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్‌నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్ నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రొ షోలు, స్పాట్ లైట్స్, స్యాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజెస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్ ఫుల్‌గా సాగనుంది.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

తెల్లారిన బతుకులు

- కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన కారు
- ఇద్దరు కూలీలు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరకాల చలివాగు వద్ద ఘటన



కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన కూలీలు



చేరాలు మృతదేహం




దుబాసి కోమల (ఫైల్)

పరకాల: కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ఇద్దరు కూలీలను పొట్టనపెట్టుకోగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని చలివాగు వంతెన శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు అదే గ్రామానికి చెందిన మద్దెబోయిన సందీప్‌కు చెందిన ఆటోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు మిర్చి తోట ఏరటానికి బుధవారం తెల్లవారుజామున బయలుదేరారు. పరకాల చలివాగు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన కారు ఆటో కుడివైపు ఢీకొని ముళ్లపొదల్లో పడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలంతా ఎగిరిపడి తీవ్ర గాయాలయ్యాయి. కుడివైపు కూర్చున్న కొంగరి చేరాలు(57), దుబాసి కొమల (56)కు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరు సిలువేరు కొంరమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తీవ్రగాయాలైన పసుల భిక్షపతి, దుబాసి సూరమ్మ, కొంగరి లక్ష్మీ, సాలికి స్వరూపలు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల మానవత్వం

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలైన సమాచారం తెలియగానే పరకాల సీఐ పుల్యాల కిషన్, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న కూలీలను ఎత్తుకొని 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రలోని సిరొంచ మండలం ఆసరవెల్లి గ్రామానికి చెందిన గుండు తేజపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత



వాంతులు చేసుకుంటున్న కూలీలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావకాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు.